# మా బతుకులతో ఆడుకోవద్దు

## మా వాళ్లను వెంటనే విడిచి పెట్టండి • సీఎం మనసు ఎందుకు కరుగుతలేదో?

**నిద్రాహారాలు మాని కాలం గడుపుతున్నం • ఊళ్లె మగపురుగు అనేదే లేకుండా పోయింది • తల్లడిల్లుతున్న హీర్యానాయక్ తల్లి, కుటుంబం**

**లగచర్ల గేట్ రోడ్డుపై బాధిత రైతు కుటుంబాల ధర్నా • రైతులను విడుదల చేయాలంటున్న ప్రజాసంఘాలు**

కొడంగల్, డిసెంబరు 13: నెలరోజులుగా కడుపుకు అన్నం లేదు.. కంటికి నిద్ర లేదు.. ఊళ్లె మగపురుగు అనేదే లేకుండపోయింది.. చిన్నపిల్లలతోనే కాలం గడుపుతున్నం.. మా వాళ్లు జైళ్ల ఏమి తిన్నరో, ఎలా ఉన్నారో? ఒంట్లు బాగలేకుంటే ఎవలు జూస్తురు? ఇంటి కాడుంటే మేము జూసుకునేటోళ్లం. ఎంతకైనా సీఎం రేవంత్‌రెడ్డి మనసు ఎందుకు కరుగతలేదు. ఇప్పటికైనా మా బతుకులతో ఆడుకోవద్దు.. మా మానాన మమ్మల్ని ఇడిసి పెట్రి.. ఇవీ లగచర్ల పరిసర బాధిత గ్రామాల రైతు కుటుంబాల గోస. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం కోస్గి–తుంకిమెట్ల రోడ్డులోని లగచర్ల గేటు వద్ద రోడ్డుపై బాధిత రైతు కుటుంబాలు శుక్రవారం ధర్నా చేపట్టాయి. ఈ ధర్నా సందర్భంగా పలువురు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మా వాళ్లకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులని, మా బతుకులు ఏం కావాలని గిరిజన రైతులు కన్నీరు పెట్టుకున్నారు. అరెస్టు అయిన వారిలో చాలా మంది అనారోగ్యాలతో బాధపడుతున్న వారే ఉన్నారని, ఏ విధంగా ఉన్నారో, ఏం మందులు వేసుకుంటున్నారో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సొంత నియోకవర్గంలో ఇంత జరుగుతున్నా, ప్రజలు ఎన్నో బాధలు పడుతున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి మనస్సు కరగడం లేదని, సీఎంకు మాపై ఇంత ద్వేషం ఎందుకో? తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

### కనికరం చూపలే..

పులిచెర్లకుంట తండాకు చెందిన హీర్యానాయక్ అరెస్టుకు ముందు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని, జైలుకు వెళ్లిన బాధతో గుండెజబ్బు వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. చేతికి బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకొని వెళ్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గుండెజబ్బు వచ్చిన వ్యక్తిని చూసుకుందామని కుటుంబసభ్యులు వెళ్లినా కలవనివ్వకుండా ఆంక్షలు విధించడం బాధకరమని పేర్కొన్నారు. కన్నతల్లి తల్లడిల్లుతున్నా సాయంత్రం వరకు కూడా కొడుకును చూడనివ్వకపోవడం దుర్మార్గమని చెప్పారు. ఎక్కడ ఏ ఆసుపత్రికి తీసుకెళ్తున్నారో కూడా సమాచారం ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఆయనతోపాటు ఇతరులకు ఏమైనా అయితే సీఎం రేవంత్‌రెడ్డిదే బాధ్యతగా పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం మనస్సు మార్చుకొని మా వాళ్లను వదిలిపెట్టాలని కోరారు. అప్పుడు, ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తూ, మా బతుకులతో ఆడుకోవద్దని హితవు పలికారు.

### మూడు రోజులైతే 9 నెలలు నిండుతయ్



మరో మూడు రోజులు గడిస్తే.. తొమ్మిది నెలలు నిండుతయి. లగచర్ల ఘటనలో మా ఆయనను పోలీసులు జైల్లో పెట్టారు. నన్ను చూసుకోవడానికి ఇంట్లో ముసలివాళ్లు తప్ప ఎవరూ లేరు. అకస్మాత్తుగా నొప్పులొస్తే.. ఏం చేయాలో ఆందోళనగా ఉన్నది. ఎక్కువగా ఆలోచిస్తే పుట్టే బిడ్డకు ఏమైనా ఇబ్బంది అవుతుందేమోనని భయం పట్టుకున్నది. ఈ పరిస్థితులో భర్త తోడుగా ఉంటే ఎంతో అండగా ఉంటుంది. నాకు ఆ అదృష్టం లేనట్టుగా ఉన్నది. రేవంత్‌రెడ్డి వస్తే బాగుపడతామనుకున్నాం. కానీ ఈ విధంగా బాధలు పడతామని కలలో కూడా అనుకోలేదు.

– జ్యోతి, పులిచెర్లకుంట తండా

### జైల్లో ఉన్నందుకు భయంతోనే గుండెపోటు



మా మామ హీర్యానాయక్‌కు జైల్లో ఉన్న భయంతోనే గుండెపోటు వచ్చింది. మాకు 6 ఎకరాలు స్వతహాగా కొన్న భూమి రోడ్డుకు అనుకొని ఉన్నది. ఎకరాకు దాదాపుగా రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ధర పలుకుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటు చేస్తే మొత్తం భూమిని కోల్పోతం. కోట్ల ధర పలికే భూములు పోతుంటే బాధ ఉంటుంది కదా. ప్రభుత్వం ఇచ్చిన భూమి కాదు. కష్టపడి కొనుక్కొన్నది. గుండెపోటు వస్తే బేడీలు వేసి మరీ ఆసుపత్రికి ఎలా తీసుకెళ్తారు. కనీసం కలిసే పరిస్థితి లేకుండా పోయింది. ఏమైనా అయితే మాకు దిక్కెవరు.

– అనిత, పులిచెర్లకుంట తండా



ర్యాలీలో సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్ నాయక్, నాయకులు

## లంబాడీలపై సీఎం రేవంత్ కక్ష

- హీర్యానాయక్‌కు ఏమి జరిగినా సర్కారుదే బాధ్యత
- బేడీలేయడం రేవంత్‌రెడ్డి క్రూరత్వానికి నిదర్శనం
- లంబాడీ నేతలు రాంబల్ నాయక్, సంజీవ్‌నాయక్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి: భూములివ్వనందుకే లంబాడీలపై సీఎం రేవంత్‌రెడ్డి కక్ష కట్టారని లంబాడీ హక్కుల పోరాట సమితి, సేవాలాల్ సేన నేతలు రాంబల్‌నాయక్, సంజీవ్‌నాయక్ విమర్శించారు. లంబాడీ రైతు హీర్యానాయక్‌ను బేడీలేసి తీసుకెళ్లడాన్ని నిరసిస్తూ సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హీర్యానాయక్‌కు ఏమి జరిగినా ప్రభుత్వమే పూర్తిబాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. లంబాడీలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి ఎందుకింత చిన్నచూపని ప్రశ్నించారు. భూములను లాక్కునేందుకు సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ప్రైవేట్ సైన్యంతో అమాయక లంబాడీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. శాంతియుతంగా చేపట్టిన లగచర్ల రైతుల పోరాటాన్ని హింసా మార్గంలోకి వెళ్లేలా చేశారని ధ్వజమెత్తారు. లంబాడీ రైతులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్లలో చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. లగచర్ల రైతుకు జైల్లో గుండెపోటు వస్తే సంకెళ్లతో దవాఖానకు తీసుకెళ్లిన తీరు రేవంత్‌రెడ్డి క్రూరత్వానికి నిదర్శనమని విమర్శించారు. లగచర్ల బాధిత రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో కల్యాణ్, రాజు, హరి, అశోక్, దేవేందర్, చందూలాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలు వద్ద మాట్లాడుతున్న హీర్యానాయక్ కుటుంబీకులు

## లగచర్ల రైతు హీర్యానాయక్ డిశ్చార్జి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 13 (నమస్తే తెలంగాణ)/ సంగారెడ్డి: లగచర్ల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్ ఛాతీలో నొప్పి కారణంగా గురువారం నిమ్స్ దవాఖానకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించి ఆరోగ్యం మెరుగుపడడంతో డిశ్చార్జ్ చేశారు. దీంతో పోలీసులు తిరిగి హీర్యానాయక్‌ను జెలుకు తరలించారు. కంది సెంట్రల్ జైలులో హీర్యానాయక్‌ను ఆయన భార్య దేవీబాయి, తండ్రి రూప్లానాయక్, తల్లి లచ్చిమిబాయి కలిసి కంటతడిపెట్టారు. హీర్యానాయక్ ఆరోగ్యం ఏమాత్రం బాగోలేకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

### రెండోరోజు కొనసాగిన విచారణ

లగచర్ల రైతు హీర్యానాయక్‌కు బేడీలు వేసిన ఘటనపై కంది సెంట్రల్‌జైల్‌లో రెండో రోజు విచారణ కొనసాగింది. మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ గురువారం రెండుగంటల పాటు విచారణ జరిపి ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి అందజేయడంతో ప్రభుత్వం కంది సెంట్రల్‌జైల్ జైలర్ సంజీవరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేసింది. జైలు సూపరింటిండెంట్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని జైళ్ల శాఖ డీజీ హోంశాఖ కార్యదర్శికి సిఫార్సు చేశారు. శుక్రవారం జైళ్ల శాఖ ఐజీలు మురళీ బాబు, రాజేశ్ కంది సెంట్రల్‌జైలుకు వచ్చి విచారణ చేపట్టారు.

## సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు..

- రాహుల్‌కు లక్నో కోర్టు సమన్లు
- జనవరి 10న హాజరు కావాలి

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: వీర్ సావర్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లక్నో న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 10న తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. 2022 డిసెంబర్ 17న మహారాష్ట్రలోని అకోలలో జరిగిన మీడియా సమావేశంలో వీర్ సావర్కర్‌పై రాహుల్ గాంధీ అనుచిత, అమర్యాదకర వ్యాఖ్యలు చేశారని న్యాయవాది నృపేంద్ర పాండే కేసు దాఖలు చేశారు. భారత జోడో యాత్రలో సావర్కర్‌ను ఉద్దేశించి రాహుల్ ఆంగ్ల సేవకుడు, పెన్షనర్ అంటూ కించపరిచేలా మాట్లాడారని ఆయన ఆరోపించారు.

## రైతులను సీఎం ఉగ్రవాదులుగా చూస్తున్నారని ఆగ్రహం

- రైతుకు బేడీలపై భగ్గుమన్న బీఆర్‌ఎస్
- సూర్యాపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన



సూర్యాపేటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సూర్యాపేట, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతును రాజుగా చూస్తే నేడు కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల భూములను లాక్కొంటూ.. కేసులు పెట్టి, బేడీలు వేసి ఉగ్రవాదులుగా చూస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ మండిపడ్డారు. లగచర్లలో రైతును దవాఖానకు తీసుకొచ్చే సమయంలోనూ బేడీలు తీయకపోవడాన్ని ఖండిస్తూ శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తెలంగాణ రైతాంగానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చిత్రహింసలతో అనారోగ్యం బారిన పడిన రైతు హీర్యానాయక్‌ను వైద్యానికి వెళితే తీసుకువెళ్లే సమయలోనూ బేడీలు వేయించడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. ప్రజలు తగిన బుద్ధి చెప్పి గద్దె దింపే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

## సంకెళ్లు వేయాల్సింది రైతులకా? రేవంత్‌కా?

**బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తేతెలంగాణ): లగచర్ల రైతుల విషయంలో బేడీలు వేయాల్సింది రైతులకా? సీఎం రేవంత్‌రెడ్డికా? అని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. రైతులతో చర్చించకుండా ఫార్మా విలేజ్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి భూములు లాక్కోవాలని చూశారని విమర్శించారు. వారు వారించినా వినకుండా పోలీసులతో దాడి చేయించారని, తీరా ఫార్మా విలేజ్‌ను రద్దు చేసుకున్నారని, ఈ వ్యవహారంలో ఎవరికి సంకెళ్లు వేయాలని నిలదీశారు. ఫార్మా విలేజ్‌ను రద్దు చేసుకున్న సర్కారు కేసులను ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదో అర్థంకావడంలేదని పేర్కొన్నారు. బందిపోటు దొంగల మాదిరిగా గుండెపోటుకు గురైన రైతుకు బేడీలు వేసినతీరు ప్రతి ఒక్కరినీ కలిచివేసిందని తెలిపారు.

## సమస్యలపై మంత్రికి రైతుల మొర

**అధికారులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఆగ్రహం**

తిరుమలాయపాలెం, డిసెంబర్ 13 : 'కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నింపేందుకు బస్తాలు లేవు. మిల్లర్లు తరుగు పేరుతో క్వింటాకు మూడు కేజీల చొప్పున కోత పెడుతున్నారు. ధాన్యం కాంటాల్లోనూ ఆలస్యం జరుగుతోంది' అంటూ గోల్‌తండా, గోపాయిగూడెం, పాతర్లపాడు, హైదర్‌సాయిపేట, కొక్కిరేణికి చెందిన రైతులు తమ ఆవేదనను ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణికి వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి దృష్టికి శుక్రవారం తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి.. కలెక్టర్, అదనపు కలెక్టర్ అక్కడ లేకపోవడంతో తన ప్రోగ్రాం లో ఇద్దరూ తప్పకుండా ఉండాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే అక్కడున్న అధికారులపై మం త్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందులు పెడుతున్న అధికారులను సస్పెండ్ చేయాలని, తరుగు పేరుతో ధాన్యంలో కోత విధిస్తున్న మిల్లు యాజమాన్యంపై విచారణ జరిపి, సీజ్ చేయాలని ఆర్డీవో నర్సింహారావు, మండల ప్రత్యేకాధికారి రమేశ్‌ను ఆదేశించారు.

## కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు ఆపాలి

- లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం
- కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నగౌడ్

హైదరాబాద్/చిక్కడపల్లి, డిసెంబర్ 13 (నమస్తేతెలంగాణ): కొన్ని రోజులుగా ఎక్సైజ్, నార్కోటిక్స్ అధికారులు కల్లు దుకాణాలపై దాడులు చేస్తూ గీత కార్మికులను భయాందోళనకు గురిచేస్తున్నారని కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నగౌడ్ ధ్వజమెత్తారు. 'కల్లుగీత కార్మికుల జోలికొస్తే ఊరుకునేదిలేదు.. ఖబర్దార్' అంటూ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కల్లుగీత సొసైటీలను రద్దుచేసి గీత కార్మికుల పొట్టగొట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ అదేతీరున ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం కల్తీ కల్లు నెపంతో కల్లు దుకాణాలపై దాడులకు ఉసిగొల్పుతున్నదని మండిపడ్డారు. ఈ దాడుల వల్ల చాలా మంది గీతన్నలు జైలులో మగ్గుతున్నారని, వీరి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత వృత్తిని ఎక్సైజ్‌శాఖ నుంచి తొలగించి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు వైన్స్ షాపుల్లో రిజర్వేషన్లు, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టడం, సేఫ్టీ మోకులు అందించడంలాంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ డిమాండ్ చేశారు.

## కడప ఎంపీ అవినాశ్ రెడ్డి అరెస్ట్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కడప ఎంపీ, వైసీపీ నేత అవినాశ్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో పులివెందుల నియోజకవర్గంలోని పలు మండలాల్లో వైసీపీకి చెందిన రైతులకు నో డ్యూస్ ఇవ్వటం లేదని ఆరోపిస్తూ రైతులతోపాటు అవినాశ్ రెడ్డి వేముల తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ టీడీపీకి చెందిన రైతులు ఉండటంతో ఉద్రిక్తత చోటు చేసుకున్నది. దీంతో ముందు జాగ్రత్తగా పోలీసులు అవినాశ్ రెడ్డిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు అక్కడి నుంచి పులివెందులకు తరలించారు.



బండ్లగూడ మహిళా భవన్‌లో తమ గోడును వినిపిస్తున్న రిసోర్స్ పర్సన్స్

## మెప్మా ఆర్పీల మహాధర్నా

- నెలవారీ జీతం రూ.20 వేలకు పెంచాలి
- 7 నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్
- అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ)/బండ్లగూడ: ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, తమను పీఆర్సీలో భాగం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని సీడీఎంఏ ప్రధాన కార్యాలయం ఎదుట పట్టణ పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) ఆధ్వర్యంలో పని చేస్తున్న రిసోర్సు పర్సన్లు (ఆర్పీ) శుక్రవారం మెరుపు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా 142 మున్సిపాలిటీల నుంచి పెద్ద సంఖ్యలోఆర్పీలు హాజరయ్యారు. తమ డిమాండ్ల సాధన కోసం సీడీఎంఏ ముందు శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆర్పీలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని నగరంలోని సైఫాబాద్, నాంపల్లి, యూసుఫ్‌గూడ, హైదర్‌గూడ పోలీస్ స్టేషన్లకు తరలించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12 మంది అర్పీలను ముందస్తుగా అరెస్టు చేశారు. అంతకు ముందు రాత్రి ఇంటెలిజెన్స్ అధికారి ఫోన్ చేసి ధర్నాలో పాల్గొంటున్నారా? అని తమను అడిగారని వారు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు వారిండ్ల వద్దకు వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత విడిచిపెట్టారని ఆర్పీలు తెలిపారు.

### ఆర్పీల ప్రధాన డిమాండ్లు ఇవే..

- పీఆర్సీలో భాగం చేయాలి. అందరికీ యూనిఫాం ఇవ్వాలి
- నెలవారీ వేతనం రూ.20,000 వరకు పెంచాలి
- అధికారుల వేధింపుల నుంచి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలి
- ఏడు నెలలుగా నిలిచిన జీతాలను వెంటనే చెల్లించాలి
- సెర్ప్–వీవోఏల మాదిరిగా ప్రభుత్వ పద్దు కింద జీతాలు చెల్లించాలి.
- జాబ్‌చార్టు విడుదల చేయాలి
- మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలి
- మూడు నెలలకోసారి నిర్వహించే ఈసీల తీర్మానం రద్దు చేయాలి

### • పేదలకిచ్చిన ఇండ్లపై రాజకీయమా..?



నిరుపేదలకు ఇచ్చిన డబుల్ బెడ్రూం ఇండ్లపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్ సర్కారు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు భాస్కర్‌గడ్డలో 416 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను పేదల కోసం నిర్మించింది. 2023 అక్టోబర్ 8న డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక చేసి ఇండ్లు కేటాయిస్తే, సంవత్సర క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ పట్టాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు 22 రోజులుగా డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద ధర్నా చేస్తున్నారు. శుక్రవారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ధర్నాకు సంఘీభావం తెలిపారు. – కృష్ణకాలనీ

## బిల్లుల కోసం మళ్లీ ప్రజావాణికి

- ఐదోసారి మాజీ సర్పంచుల వినతి
- సీఎం అసెంబ్లీలో ప్రకటించాలని డిమాండ్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచులు ఐదోసారి శుక్రవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో ప్రజాభవన్‌లో ప్రజాపాలన ప్రత్యేకాధిరాణి దివ్యదేవరాజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని పేర్కొన్నారు. దీంతో అప్పుల భారం పెరిగి అనేకమంది మనోవేదనతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి అసెంబ్లీ సమావేశాల్లోనే స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ధాన్యం దారి మళ్లిస్తే కఠిన చర్యలు: చౌహాన్

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తేతెలంగాణ): ధాన్యం దారి మళ్లిస్తే బాధ్యులైన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లయ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిల్లులకు చేరిన ధాన్యం నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నాలుగు రోజుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు పలువురిని అరెస్ట్ చేశామని తెలిపారు.

### • రైతన్నకు ఎంత కష్టం..



బేల మండల కేంద్రంలో పత్తి రైతులు రాత్రి సమయంలో వాహనాల వద్ద కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎముకల కొరికే చలిలో అటు సోయా రైతులు, ఇటు పత్తి రైతులు రాత్రి పూట పంటను విక్రయించేందుకు కాపలా ఉంటూ ఇబ్బంది పడుతున్నారు. – ఆదిలాబాద్, డిసెంబర్ 13 ( నమస్తే తెలంగాణ)

## పత్తి కొనండి మహాప్రభో..

- సీసీఐ అధికారులు నిరాకరించడంతో కలెక్టరేట్ ఎదుట పత్తి ట్రాక్టర్‌తో రైతు నిరసన



పత్తిని చూపెడుతున్న రైతు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 13: 'పత్తి కొనుగోలు చేయండి మహాప్రభో' అంటూ ఓ రైతు ప్రభుత్వాన్ని వేడుకున్నాడు. సీసీఐ అధికారులు ఎంతకూ కనికరించకపోవడంతో రైతు శుక్రవారం జనగామ జిల్లా కలెక్టరేట్ ఎదుట పత్తి ట్రాక్టర్‌ను అడ్డుగాపెట్టి నిరసన వ్యక్తం చేశాడు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను కలిసి గోడు వెల్లబోసుకున్నాడు. స్పందించిన కలెక్టర్ వెంటనే మార్కెటింగ్ అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. బాధిత రైతు కట్టా పరశురాములు కథనం ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలకు చెందిన రైతు పరశురాములు పత్తి పంట విక్రయానికి లింగాలఘనపురం మండలం నెల్లుట్ల సత్యసాయి కాటన్ మిల్ సీసీఐ కేంద్రానికి శుక్రవారం ట్రాక్టర్‌లో తీసుకొచ్చారు. అక్కడి సీసీఐ అధికారులు చెత్త ఎక్కువ ఉందన్న కారణంతో కొనుగోలు కుదరదని చెప్పారు. దీంతో దిక్కుతోచని స్థితిలో కలెక్టరేట్‌కు చేరుకొని నిరసన తెలిపాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీఐ అధికారులు పరశురాములుకు సంబంధించిన 26 క్వింటాళ్ల పత్తిని రూ.7125 కనిష్ఠ మద్దతు ధరకు కొనుగోలు చేశారు.


## ఊరంతా విద్యుత్తు షాక్


**వివాహిత మృతి**



అనిత (ఫైల్)

నర్సాపూర్, డిసెంబర్13: ఊరంతా విద్యుత్ షాక్ గుర్రై వివాహిత మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఎర్రకుంటతండా గ్రామపంచాయతీ పరిధిలోని బాల్యాతండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. తండావాసుల వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఇంట్లో ఉన్న సామగ్రికి, గోడలకు, ఇతర వస్తువులకు విద్యుత్ సరఫరా జరిగి షాక్ రావడంతో తండావాసులు ఆందోళనకు గురయ్యారు. బాల్యాతండాకు చెందిన హలావత్ అనిత వంటగదిలో స్టీల్ వస్తువు తగిలి విద్యుత్ షాక్‌కు గుర్రై మృతి చెందింది. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వగా ఎవరూ స్పందించలేదని, ఉదయం 10 గంటల వరకు ఏ అధికారి రాలేదని తండావాసులు వాపోయారు. మృతురాలు అనితకు భర్త శ్రీనివాస్, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.





శ్రీశైలం(ఫైల్), వెంకటమ్మ(ఫైల్)

## కొడుకు మరణవార్త విని కుప్పకూలిన తల్లి

**ఒకే రోజు తల్లి, కొడుకు మృతి**
**లింగంపల్లిలో విషాదం**

కులకచర్ల, డిసెంబర్ 13 : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందగా ఆ విషయం తెలిసి అతని తల్లి కుప్పకూలి మరణించిన ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలోని లింగంపల్లిలో జరిగింది. లింగంపల్లికి చెందిన మ్యాకల శ్రీశైలం(34) గత నెల 24న పురుగులమందు తాగి ఆత్మహత్యకుయత్నించాడు. అతను ఒక వీడియోలో తన చావుకు కారణం లింగంపల్లికి చెందిన బాల్‌రాజ్, లక్ష్మణ్, రాములుగా పేర్కొన్నాడు. అతను చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శ్రీశైలం మృతి విషయం తెలిసిన వెంటనే అతని తల్లి వెంకటమ్మ(52) ఉన్న చోటే కుప్పకూలి మృతి చెందింది. బాల్‌రాజ్, లక్ష్మణ్ రాములును పోలీసులు శుక్రవారం పరిగి సబ్‌జైలుకు పంపించారు.

## వజ్రోత్సవ వేడుకల్లో కోదండరెడ్డి నిలదీత

కాశీబుగ్గ, డిసెంబర్13: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వజ్రోత్సవ వేడుకల్లో రైతులు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని నిలదీశారు. రుణమాఫీ వంద శాతం అయినట్లు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అబద్ధాలు చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కాకుంటే రైతులంతా ఏకమై ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వెంటనే స్పందించిన కోదండరెడ్డి తొందర పడొద్దని, టెక్నికల్ ప్రాబ్లమ్‌తో రుణమాఫీ నిలిచిపోయిందన్నారు. తొందర్లోనే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.




అగ్రికల్చర్ యూనివర్సిటీ వజ్రోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కోదండరెడ్డి, నిలదీస్తున్న రైతు(ఇన్‌సెట్‌లో)